



# తాగునీటి ఎద్దడి రానివ్వద్దు

- కలెక్టర్ బీ సత్యప్రసాద్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 7: రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని మండలాల పరిధిలోని మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవో, ఎంపీవోలు, ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా తాగునీటి సరఫరాలో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్‌సోర్స్, ఇబ్బందుల గురించి మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సారెస్పీ పైప్‌లైన్ బల్క్ సమస్యను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. గత వేసవిలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం మండలాల వారీగా ఇంటి పన్ను చెల్లింపు శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కచ్చితంగా వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశం లో అదనపు కలెక్టర్ బీ గౌతమ్‌రెడ్డి, డీపీవో మదన్‌మోహన్, డీఈఈ, మిషన్ భగీరథ అధికారులు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఐదుగురికి జైలు

పెగడపల్లి, ఫిబ్రవరి 7: పలు కేసులకు సంబంధించి కోర్టు సమన్లను నిర్లక్ష్యం చేసిన ఐదుగురిని శుక్రవారం జైలుకు తరలించినట్లు ఎస్ఐ సీహెచ్ రవికిరణ్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పరిసె రాయమల్లు, నామసాని రాజయ్య, ఎనగందుల విక్రమ్, సట్ట నాంపల్లి, నామసాని రాజ్‌కుమార్‌కు వివిధ కేసుల్లో కోర్టు నుంచి సమన్లు రాగా, వారు కోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. వీరందరిని కోర్టులో హాజరుపర్చగా జగిత్యాల జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వినిల్‌కుమార్ వారికి వారం రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇక్కడ పోలీస్ సిబ్బంది వెంకటరెడ్డి, సంపత్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## ఆయుర్వేద కంపెనీకి ₹10వేల జరిమానా

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 7: ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా ఉన్న ఆయుర్వేద మందుల కంపెనీకి ₹10వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జూనియర్ సివిల్ జడ్జి టీ జితేందర్ తీర్పునిచ్చారని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 2024 ఆగస్టులో జిల్లా కేంద్రంలోని పలు మెడికల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో హిమచల్‌ప్రదేశ్‌కు చెందిన రోహిణి బయోకేర్ కంపెనీ సిగ్న–డి స్టోన్ క్యాప్స్యూల్స్ పేరుతో ఆయుర్వేదిక్ క్యాప్స్యూల్స్ లేబుల్ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉండడంతో సదరు కంపెనీపై కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం సదరు కంపెనీకి ₹10వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారని తెలిపారు.

## చోరీకి యత్నించిన వ్యక్తి బైక్ స్వాధీనం

మల్యాల (కొడిమ్యాల), ఫిబ్రవరి 7: మల్యాల మండలం రామన్నపేటలో శనివారం తెల్లవారుజామున చోరీకి యత్నించిన వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన ఓ వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున రామన్నపేటలో ఓ ఇంట్లో చోరీ చేసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ఈ క్రమంలో ఇంటి యజమాని లేవడంతో సదరు దుండగుడు తన ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

# ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు

- పలు చోట్ల కోతకు గురైన రోడ్డు
- గుబురుగా రోడ్డుపైకి చెట్ల కొమ్మలు
- ఇబ్బందుల్లో వాహనదారులు



బీర్‌పూర్ నుంచి ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా కోతకు గురైన రహదారి

సారంగాపూర్, ఫిబ్రవరి7: బీర్‌పూర్ మండలంలోని బీర్‌పూర్ ఘాట్‌రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఘాట్‌రోడ్డుపై మూలమలుపుల వద్ద రోడ్డు చిన్నదిగా ఉండడం, గుబురుగా ఉన్న చెట్లు ఉండడం, ఇటీవల కురిసిన వర్షాలతో సీసీ రోడ్డుకు ఇరువైపులా రోడ్డు కోతకు గురికావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఘాట్ రోడ్డు మీదుగా నిర్మల్, ఆదిలాబాద్, కడెం, జన్నారంతోపాటు మండలంలోని 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి 12 రోజులపాటు జాతర ఉత్సవాలు జరుగనుండగా, వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 3లక్షలపైనే భక్తులు వచ్చే అవకాశం ఉన్నది. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖ అధికారులు వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే రేచపల్లి గ్రామం నుంచి బట్టపెల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారికి అడుగడుగునా ఉన్న మూలమలుపుల వద్ద ప్రమాదాల జరుగకుండా సంబంధితశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

## భార్య మృతి తట్టుకోలేక ఆత్మహత్య

జమ్మికుంట, ఫిబ్రవరి 7: భార్య మృతిని తట్టుకోలేక పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మడిపల్లిలో జరిగింది. పట్టణ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. మడిపల్లికి చెందిన రాజేందర్(53)భార్య అనారోగ్యంతో మూడు నెలల క్రితం మృతి చెందింది. భార్య మృ తితో మనస్తాపానికి గురైన రాజేందర్, శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కొడుకు శరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

## నేతకాని కుల జనాభా తక్కువ చూపించారు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 7: రాష్ట్ర వ్యాప్తంగా నేతకాని కులస్తుల జనాభాను కులగణన సర్వేలో తక్కువ చూపించారని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం మారుతి ఆరోపించారు. నగరంలోని ప్రెస్ భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నేతకాని కులస్తులు 15లక్షల మంది ఉంటారని, కానీ సర్వేలో తక్కువ చూపించారని పేర్కొన్నారు. అత్యంత వెనుకబడిన నేతకాని కులాన్ని గ్రూప్ 1లో చేర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు ముందు మాల మాదిగ, నేతకాని రాష్ట్ర నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడ నేతలు మోహన్, కొమురయ్య, చంద్రయ్య, శివయ్య పాల్గొన్నారు.

# జగిత్యాలలో ఏసీబీ తనిఖీలు

- హనుమకొండ డీటీసీ సొంత ఇంట్లో రైడ్
- పలు పత్రాలు స్వాధీనం?



డీటీసీ శ్రీనివాస్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 7: హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) పుప్పాల శ్రీనివాస్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగిఉన్నాడంటూ శుక్రవారం ఏసీబీ అధికారులు జగిత్యాల పట్టణంలోని ఆయన నివాసంలో తనిఖీలు చేశారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో జగిత్యాలలోని డీటీసీ శ్రీనివాస్ ఇంట్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించి బంగారు ఆభరణాలు, ఇతర పత్రాలను పరిశీలించారు. పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అలాగే హనుమకొండ, కరీంనగర్‌లో డీటీసీ శ్రీనివాస్ బంధువుల ఇండ్లలో కూడా తనిఖీలు నిర్వహించారు.

## మత్తుకు బానిస కావొద్దు

రాంనగర్, ఫిబ్రవరి 7: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ సూచించారు. శుక్రవారం చొప్పదండి మండలం రుక్మాపూర్ కేజీబీవీలో మత్తు పదార్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారమయం అవుతుందన్నారు. కలెక్టర్ సూచన మేరకు పాఠశాలలో కాన్షియస్‌నెస్ క్లబ్ ఏర్పాటు చేశారు.

## పరిహారం చెల్లించండి

గంగాధర, ఫిబ్రవరి 7 : కొత్తపల్లి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన తమకు పరిహారం చెల్లించాలని మండలంలోని రంగరావుపల్లికి చెందిన నిర్వాసితులు శుక్రవారం తహసీల్దార్ అనుపమను కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయి పరిహారం అందక ఇబ్బంది పడుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఇక్కడ గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూరియా గోదాం తనిఖీ



సహకార సంఘం సీఈవోకు నోటీస్ ఇస్తున్న ఏవో యోగిత

కథలాపూర్, ఫిబ్రవరి 7: గంభీర్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలోని యూరియా గోదామును ఏవో యోగిత శుక్రవారం తనిఖీ చేశారు. గోదాములో నిల్వ ఉన్న యూరియా బస్తాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. రికార్డులు, నిల్వ ఉన్న యూరియా బస్తాలకు పొంతన లేకపోవడంతో వెంటనే విక్రయాలు నిలిపివేయాలని సీఈవోకు నోటీసులు ఇచ్చారు. 15రోజుల్లో సమాధానం ఇవ్వాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 7: గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు 90 రోజులపాటు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత ఉపాధి శిక్షణ ఇస్తున్నట్లు అకాడమీ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పీ అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ప్లంబింగ్ అండ్ శానిటేషన్ తదితర కోర్సులు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్ లేదా ఐటీఐ కోర్స్ చేసినవారు ల్యాండ్ సర్వే శిక్షణకు అర్హులని, మిగతా రెండు కోర్సుల కోసం పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి హుజూరాబాద్ కేసీ క్యాంపులో గల పాత డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ ఇప్పిస్తామని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తున్నట్టు అశోక్ కుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9848827124 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

మంథని, ఫిబ్రవరి 7: 108 సిబ్బంది సీపీఆర్ చేసి ఓ వృద్ధురాలి ప్రాణాలు కాపాడారు. మంథని మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన అడిగొప్పుల రాజమ్మ ఇంట్లో నిలువ చేసిన డీజిల్‌ను అనుకోకుండా సేవించింది. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ఆమెను మొదటగా మంథని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు గోదావరిఖని తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె గుండె ఆగి పోయింది. దీంతో అప్రమత్తమైన మెడికల్ టెక్నీషియన్ శ్రీనివాస్ సీపీఆర్ చేసి వృద్ధురాలి గుండె తిరిగి కొట్టుకునేలా చేశారు. ఆనంతరం ఆమెను గోదావరిఖని దవాఖానలో చేర్పించారు.

## కామన్ మెనూ అమలు చేయాలి

అంతర్గాం, ఫిబ్రవరి 7: విద్యార్థినులకు కామన్ మెనూ డైట్ కట్టుదిట్టంగా అమలు చేయాలని స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ అరుణశ్రీ పేర్కొన్నారు. రామగుండంలోని ఎస్సీ బాలికల గురుకులంలో నైట్ హాల్ట్ నిర్వహించిన అదనపు కలెక్టర్ గురుకులంలోని డార్మెటరీ, తరగతి గదులు, పారిశుద్ధ్య నిర్వహణ, భోజనశాల, వంటగదిని తనిఖీ చేశారు. బాలికలతో మాట్లాడి భోజన వసతి, నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, విద్యబోధనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాల నిర్వహణను పర్యవేక్షించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు నైట్‌హాల్ట్ కార్యక్రమాన్ని చెపట్టినట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

## తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 7: చెర్లభూత్కూర్ గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మను దహనం చేశారు. రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలకు గానూ తీన్మార్ మల్లన్న వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెర్లభూత్కూర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు నల్ల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, కూర శ్యాంసుందర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.